
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
3
గురువారం 8 మే 2025



పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సైన్యానికి సంఘీభావంగా జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో బాణసంచా కల్చి సంబరాలు చేసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల కేంద్రంలో హిందు సంఘాల ఆధ్వర్యంలో యువకులు జాతీయ జెండాను ఆవిష్కరించి, పాకిస్తాన్ జెండాను దగ్ధం చేశారు. అనంతరం టపాసులు పేల్చి విజయోత్సవం నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా యువకులు నినాదాలు చేశారు. హిందువుల ఐక్యత వర్ధిల్లాలి, పాకిస్తాన్‌ను తరిమి కొట్టాలని నినాదాలు చేశారు.

-ఘట్‌కేసర్/కులకచర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి):

'సిందూర్'పై సంబురం

జాతీయ జెండాలతో ర్యాలీలు
'భారత్‌మాతాకీ జై' అంటూ నినాదాలు



కులకచర్లలో జాతీయ జెండాలతో యువకులు





అన్నోజిగూడలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకుంటున్న యువకులు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్

ప్రధాని మోదీకి అభినందనలు

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం.. జిల్లా బార్ అసోసియేషన్

వికారాబాద్, మే7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉగ్రవాదులను అణిచివేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వికారాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత పాక్ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన దాడులను పురస్కరించుకుని బుధవారం జిల్లా బార్ అసోసియేషన్ అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను అణచివేసేందుకు ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతీ చర్యకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూలి బస్వరాజ్ ప్రకటించారు. మన దేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలను కూడా ఉపేక్షించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జిల్లా బార్ అసోసియేషన్ అభినందనలు తెలియజేస్తూ తీర్మానం చేసింది.



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమ/కొడంగల్ రూరల్: మే 7(ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రేణుకాదేవి సూచించారు. బుధవారం ఆమె బొంపల్లి పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సందర్శించారు. సెలవుల్లో ఏఐ విధానంతో అందిస్తున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులు పట్టుదలతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, హెచ్‌ఎం షఫీ, టీచర్లు పాల్గొన్నారు.

హుస్సేన్‌పూర్ పాఠశాలలో..

విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరంలో భాగంగా హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. హెచ్‌ఎం క్రాంతికుమార్ విద్యార్థులకు క్రీడలు, నృత్యాలు, మార్షల్ ఆర్ట్స్, చిత్రలేఖనం, పాటలు, కంప్యూటర్ స్కిల్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.





పరిగిలో నీటి శుద్ధి యంత్రాలు

నిబంధనలకు నీళ్లు!

పుట్టగొడుగుల్లా నీటి శుద్ధి ప్లాంట్లు

అనుమతులు లేకుండానే నిర్వహణ
రోగాల బారిన పడుతున్న ప్రజలు
పరిగిలో రెండు లక్షల లీటర్ల వ్యాపారం
ఒక్క పరిగిలోనే నెలకు రూ.60 లక్షల వ్యాపారం

నీటి శుద్ధి పేరిట విచ్చలవిడిగా దోపిడీ జరుగుతోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలుపై అధికారుల నిఘా కరువైంది. దీంతో నిర్వాహకులు సరఫరా చేసిందే శుద్ధ జలం అన్నట్లుగా మారింది. కనీస నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. పరిగి పట్టణంలో 30కి పైగా వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్లు ఉంటే అందులో ఒకటి, రెండింటికి మాత్రమే అనుమతులున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక పరిగి పట్టణంలోనే నిత్యం లక్షన్నర లీటర్లకు పైగా తాగునీటి వ్యాపారం సాగుతోంది. 20 లీటర్ల డబ్బాలు రూ.20లు, కూల్‌వాటర్ డబ్బాలు రూ.50 నుంచి రూ.60ల వరకు విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.

పరిగి, మే7(ఆంధ్రజ్యోతి): శుద్ధిజలం పేరుతో జనాన్ని దోపిడీ చేస్తున్నారు. పల్లెల్లో మిషన్ భగీరథ నీటిని జనం అసలు తాగడం లేదు. ఆ నీటిపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. బోర్లు, మున్సిపల్ ద్వారా సరఫరా అయ్యే నీటిలో ఫ్లోరైడ్ ఉందంటూ శుద్ధజలం వైపు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంట్‌లను తెరిచి నిబంధనలు పట్టించుకోకుండా నీటి దందాకు తెరలేపారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజు రోజుకు పుట్టుకొస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రజారోగ్యాన్ని

మిగతా 5వ పేజీలో...

ఆ నీళ్లు తాగితే కీళ్లనొప్పులు



మినరల్ వాటర్ పేరుతో దోపిడీ జరుగుతోంది. నీటిశుద్ధికి కనీస నిబంధనలు పాటించడం లేదు. ఒక్కో 20 లీటర్ల డబ్బాకు రూ.20 నుంచి రూ.25 వసూలు చేస్తున్నారు. ఆ నీటిలో కనీస మినరల్స్ ఉండటం లేదు. ఆ నీరు తాగిన వారు కీళ్లనొప్పులతో పాటు, పలు రకాలు వ్యాధులతో బాధపడుతున్నారు. శుద్ధిజలం ప్లాంట్లపై సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టాలి.

-చిన్నయ్య, పరిగి నివాసి

ఇంటర్ సప్లిమెంటరీ

ఫీజు చెల్లింపు నేటితో ఆఖరు

వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 8వ తేదీ వరకు వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో పరీక్ష ఫీజును సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజు త్వరగా చెల్లించేలా తల్లిదండ్రులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటగోపాల్

అంగన్‌వాడీలకు మరిన్ని సౌకర్యాలు

శామీర్‌పేట, మే 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేయించి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఐసీడీఎస్ సీడీపీవో శారద, అంగన్‌వాడీ టీచర్లకు భరోసా ఇచ్చారు. బుధవారం శామీర్‌పేటలోని అంగన్‌వాడీ 3, 4 సెంటర్లలో నెలకొన్న సమస్యల గురించి సీడీపీవో శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, టీచర్లు, కమిషనర్ వెంకటగోపాల్‌కు వివరించారు. ఈ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై కమిషనర్, డిప్యూటీ ఇంజినీర్ సునీత, కార్యదర్శి మౌనిక ప్రత్యక్షంగా పరిశీలించారు. త్వరలోనే అవసరమైన మరమ్మతులు చేసి సౌకర్యాలను కల్పిస్తామని సీడీపీఓకు హామీ ఇచ్చారు. నాలుగో నంబర్ కేంద్ర భవనానికి మరమ్మతులను, మూడో నంబర్ కేంద్రానికి డ్రైనేజీ వ్యవస్థను, సీసీ రోడ్డును యుద్ధ ప్రాతిపాదికన చేస్తామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం కావాలి

పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

రిజర్వేషన్ల ప్రకారం జాబితా సిద్ధం చేసుకోవాలి

పార్టీలో గ్రూపులకు తావివ్వొద్దు
గెలుపే లక్ష్యంగా ప్రణాళిక ఉండాలి
కాంగ్రెస్ సంస్థాగత సన్నాహక సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 'సంవిధాన్ బచావ్' ర్యాలీ స్థానిక గాంధీ పార్కు నుంచి రైల్వే స్టేషన్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. అనంతరం సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ సంస్థాగత సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని హామీలు నెరవేర్చిన తర్వాతనే సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు వెళ్లనున్నారని చెప్పారు.

సీఎం చొరవతో వికారాబాద్ అభివృద్ధి

డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో

మిగతా 5వ పేజీలో...



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పోటీలో ఉండేవారి వివరాలు సిద్ధం చేసుకోవాలి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఏవి ముందుగా వస్తే వాటికి సిద్ధమయ్యేలా, ఏ రిజర్వేషన్ వస్తే ఆ రిజర్వేషన్‌కు అనుగుణంగా పోటీలో ఉండే వారి వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ, జనరల్, మహిళా రిజర్వేషన్ వస్తే ఎవరు ఎన్నికల్లో పోటీ చేస్తారనేది ముందే చర్చించుకోవాలన్నారు. పార్టీలో గ్రూప్‌లకు తావు ఉండొద్దు. పార్టీ నుంచి ఇద్దరు నిలబడి ఓడిపోయే విధంగా చేసుకోవద్దని హితవు పలికారు. పాత రోజుల్లో మాదిరిగా రియల్ ఏస్టేట్ వ్యాపారం లేదని, ఎవరి వద్ద డబ్బులు లేవని, అమ్మే వారు ఉన్నా కొనుగోలు చేసేవారు లేరని, మధ్యవర్తిత్వం చేద్దామనుకున్నా చేసే పరిస్థితి లేదన్నారు. ఉన్న డబ్బులను చాలా జాగ్రత్తగా ఖర్చు చేసుకుని ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు పార్టీ తరఫున సహాయం అందే విధంగా ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు.

ఈటల నివాసానికి చినజీయర్ స్వామి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసానికి త్రిదండి చినజీయర్ స్వామి బుధవారం విచ్చేశారు. మునీరాబాద్ గ్రామ శివారులోని ఈటల నివాసానికి విచ్చేసిన స్వామికి ఆయన కుటుంబం సాధారణంగా స్వాగతం పలికి పాద పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈటల కుటుంబ సభ్యులతో పాటు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

-మేడ్చల్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి)





దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి

భూ భారతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం

కీసర, మే7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్‌తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి అన్నా రు. భూ భారతి చట్టంలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. బుధవారం కీసర, చీర్యాల్‌లో సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలపై కీసరలో 243, చీర్యాల్ 107 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సుగుణాబాయి

డీసీఎంఎస్ డీఎం సుగుణాబాయి

ఘట్‌కేసర్ రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్, మాధారంలోని దాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణాబాయి బుధవారం సందర్శించారు. వడ్లలో తాలు, మట్టి లేకుండా తూర్పారబట్టాలని రైతులకు సూచించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అకాల వర్షం.. ఆగమాగం' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి ఎండిన వడ్లను వెంటనే కాంట వేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. టోకెన్ల ప్రకారం తూకం వేయాలని తెలిపారు. అకాల వర్షాలు వస్తున్నందున తమ వడ్లను త్వరగా తూకం వేసుకోవాలని డీఎంను రైతులు కోరారు. కార్యక్రమంలో ఏవో బాసిత్, ఏఈవో రాజ్‌కుమార్, సెంటర్ ఇన్‌చార్జి ప్రవీణ్ రెడ్డి, నాయకులు, రైతులు కొమ్మిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాయ నరేష్, ఆంజనేయులు, సత్తయ్య, నర్సింహ, శివకుమార్, సురేష్, వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తాండూరు, మే 7(ఆంధ్రజ్యోతి):మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోట్ చేసిన ప్రభుత్వం 12నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరులో మాట్లాడారు. పోరాడి విజయం సాధించిన మినీ అంగన్‌వాడీ టీచర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 2024 జనవరిలోనే మినీలను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోట్ చేసినా జీవో ఇవ్వక వేతనాలు పెండింగ్‌లో పెట్టారన్నారు.

కాంగ్రెస్‌కు మాజీ సర్పంచ్ రాజీనామా

తాండూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్ మాజీ సర్పంచ్ నందిని, ఆమె భర్త మాజీ ఉపసర్పంచ్ యాదయ్యగౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం పేర్కొన్నారు. రాజీనామాను యాదయ్యగౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జన్నె నాగప్పకు అందజేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి గెలుపు కోసం కష్టపడి పనిచేశామని, ఇప్పుడు పార్టీలో తమకు గుర్తింపే లేదని వాపోయారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

చౌదరిగూడ, మే7(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామంలోని నాగార్జున హేచరీస్ యాజమాన్యం షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి ద్వారా విరాళాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి

శంకర్‌పల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని గ్రామ కార్యదర్శులను శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రత్యేకాధికారి సురేష్‌బాబుతో కలిసి గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని, నీళ్ల సరిపోనియెడల ట్యాంకర్లతో సరఫరా చేయించాలన్నారు. ఇందిరమ్మఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవాలకు 'గాలికుంటు' టీకాలు వేయించాలి

శంకర్‌పల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి శ్రావణిగౌడ్ తెలిపారు. పిల్లిగుండ్ల గ్రామంలో బుధవారం ఆమె పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల సూచన మేరకు పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చౌదరిగూడ, మే7(ఆంధ్రజ్యోతి): పర్యవరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని బీఆర్ఎస్ యువ నాయకుడు మురళీ యాదవ్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యవరణంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థలు, పర్యావరణ ప్రేమికులపై ఉందన్నారు. అనంతరం చింతకుంట తండాకు చెందిన వినోద్ గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ మండల కో-ఆర్డినేటర్‌గా ఎన్నికైన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ హఫీజ్, బాబురావు, జబ్బార్, ఇస్మాయిల్, మల్లేష్, రాంచరణ్, పాండు, శివరాజ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ దేశ ప్రజల ఆస్తి

● స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఒక కులానికో, మతానికో సంబంధించిన వారు కాదని, వారు ఈ దేశ ప్రజల ఆస్తి అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లిలో 12 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక చరిత్ర కాదని.. నేటి వాస్తవానికి ప్రతీక కొనియాడారు. అంబేడ్కర్ ఆలోచనకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, దేశ చరిత్రలోనే మొదటి సారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండడం వల్లనే దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ రచనకు ఆయన సేవలు తీసుకోవడం జరిగిందన్నారు. చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాంమోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, శుభప్రద్ పటేల్, వడ్లనందు, సుధాకర్ రెడ్డి, కిషన్ నాయక్, ఎర్రవల్లి జాఫర్, మహిపాల్ రెడ్డి, విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

పేర్ల కోసం గొడవ.. శిలాఫలకం ధ్వంసం

అంబేడ్కర్ 12 అడుగుల విగ్రహ ఏర్పాటులో భాగంగా పలువురు నేతల మధ్య గొడవ చెలరేగింది. విగ్రహం ఏర్పాటు చేసే శిలాఫలకంలో తమ పేర్లు లేవని ఓవర్గం ఆవేదనతో ఆశిలాఫలాకాన్ని ధ్వంసం చేసింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి రెండు వర్గాలుగా విడిపోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. తమ పేర్లు లేవని కొందరూ అంటే మా పేర్లు ఉన్నందుకే కావాలని శిలాఫలకం పగలగొట్టారని మరి కొందరూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు కలుగచేసుకుని సముదాయించి శిలాఫలకం లేకుండానే విగ్రహాన్ని ప్రారంభించారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


కల్యాణంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మూడుచింతలపల్లి,మే 7(ఆంధ్రజ్యోతి): కేశవరంలో ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై స్వామి వారికి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, మాజీసర్పంచ్‌లు పాల్గొ

















కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి



ముజాహిద్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, మే 7(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులకు, వ్యాపారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని, మద్దతు ధర, బోనస్ ఇస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ధారూరు: మండల పరిధిలోని నాగారం, మోమిన్‌కలాన్, గురుదోట్ల, నాగసమందర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్‌లు ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దొడ్డు ధాన్యం క్వింటాలుకు రూ.2,320, సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్‌తో క్వింటాలుకు రూ.2,820లకు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రైతులు కొనుగోలే కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని వారు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో నర్సింహులు, ఏఈవో సంజీవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.



ధారూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బొంరాస్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్సై వెంకటకృష్ణ సూచించారు. బుధవారం బొంరాస్‌పేట్‌లోని ఎస్బీఐ బ్యాంకు వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల ఫోన్‌లు, వాట్సప్ ద్వారా వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్సై వెంకటకృష్ణ

అత్యవసర సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు

శామీర్‌పేట, మే 7(ఆంధ్రజ్యోతి): నేర ప్రమాదాల, ఉగ్రవాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. బుధవారం తూంకుంటలో యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 4:30 వరకు సైరన్ వాహనాలతో తిరిగారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల పరిస్థితులు నెలకొన్నప్పుడు ప్రజలు సమీప సురక్షిత స్థలాలను గుర్తించి వెంటనే రక్షణ కోసం ఎలా స్పందించాలో అవగాహన కల్పించారు. వదంతులను, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని వివరించారు. ప్రజలు బయట చిక్కుకుపోతే ఆశ్రయం దొరకని పరిస్థితుల్లో కిందికి వాలిపోవాలని, తక్కువ స్థాయి ప్రాంతాల్లో నేలపై పడుకోవాలని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల

తాండూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు విడుదల చేశారు. బుధవారం తాండూరు పట్టణంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా నాయకులు కార్మికులను కోరారు. కార్మికుల హక్కుల సాధనలో భాగంగా అన్ని సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. యాజమాన్యాలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించేందుకు సమ్మెల్లో అన్ని రంగాలు, వర్గాల కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, యూనియన్ నాయకులు సంజీవ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

నేడు యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక

బొంరాస్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని సంగమేశ్వర ఆలయం ఆవరణలో గురువారం అఖిల భారత యాదవ సంఘం మండల ఎన్నిక నిర్వహించనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నిక కార్యక్రమానికి జిల్లా నాయకులు జింకల యాదయ్య, వెంకట నర్సయ్య తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని యాదవసోదరులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



అల్లాపూర్‌లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు ←

ధారూరు, మే7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. అల్లాపూర్‌లో తహసీల్దార్ సాజిదా బేగం బృందం, అల్లీపూర్‌లో కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ బృందం సదస్సులు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తులను అందజేశారు. కాగా అల్లాపూర్‌లో గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న 45మందికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం సర్వే నంబరు 11లో రెండెకాల చొప్పున పట్టాలిచ్చిందని గ్రామస్తులు తెలిపారు. అయితే ఇటీవల ఫారెస్ట్ అధికారులు ఈ భూమి రిజర్వ్ ఫారెస్టిది అని ఫెన్సింగ్ వేశారని చెప్పారు. రెవెన్యూ సదస్సులో ఇలాంటి సమస్యలను పరిష్కరించలేమని అధికారులు వారికి తెలిపారు. అల్లాపూర్‌లో 7, అల్లీపూర్‌లో 17 దరఖాస్తులొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయేందర్, రైతులు పాల్గొన్నారు.

'రోడ్లపై గుంతల పూడ్చివేతకు యువకులు తరలిరావాలి'

పెద్దేముల్, మే 7(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పెద్దేముల్ మండలం గాజీపూర్ నుంచి పెద్దేముల్ వరకు బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చివేసేందుకు యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతాయని, ప్రజలు ఎవరు ప్రమాదాల బారిన పడకుండా రోడ్లపై పడ్డ గుంతలను శ్రమదానంతో పూడ్చేందుకు అందరూ ముందుకు రావాలని చెప్పారు. గురువారం రోజు ఉదయం 11గంటల నుంచి మరమ్మతులు ప్రారంభిద్దామని అన్నారు. యువకులు అధికసంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



మేడ్చల్‌లో కన్యకా పరమేశ్వరి జయంతిని నిర్వహిస్తున్న ఆర్య వైశ్యులు

తాండూరు, మే 7(ఆంధ్రజ్యోతి): అహింస, సామరస్యతను చాటిన మాతగా పేరొందిన వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు తాండూరులో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. నగరేశ్వర ఆలయంలో కన్యకా పరమేశ్వరి మాత విగ్రహాన్ని అలంకరించి బంగారు కిరీటం పెట్టారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య కమ్యూనిటీ నుంచి పదవులు నిర్వహించిన మాజీ చైర్‌పర్సన్‌లు కొత్రిక విజయలక్ష్మి, స్వప్న పరిమళ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాలువ సుజాతలను సన్మానించారు.

కొడంగల్: ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి జయంతిని నిర్వహించారు. నగరేశ్వరస్వామి ఆలయంలో శివుడికి రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్‌గుప్తా, నందారం ప్రశాంత్, ఎల్లయ్య, ఈశ్వరయ్య, నారాయణ, రామానంద్, ప్రవీణ్, మురళి, చందు, వినోద్‌కుమార్, మమత, అనిత, హైమవతి, శ్రీదేవి, గాయత్రి, ప్రసన్న పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతి వేడుకలు మేడ్చల్‌లో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, పూజలు నిర్వహించారు.



తాండూరు నగరేశ్వరాలయంలో కన్యకా పరమేశ్వరి మాత



తాండూరులో ఆర్యవైశ్య మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న సంఘం నాయకులు



కొడంగల్ నగరేశ్వరాలయంలో కుంకుమార్చలో మహిళలు

దుకాణా సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



దుకాణాల యజమానులతో మాట్లాడతున్న సీఐ వెంకట్

మోమిన్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఫంక్షన్ హాళ్లు, పెట్రోల్ బంకులు, ఫర్టిలైజర్ దుకాణాదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ వెంకట్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సీసీ కెమెరాలు నేరాల కట్టడికి ఎంతో దోహదపడతాయన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. దొంగతనాల నివారణ, అనుమానాస్పద వ్యక్తులను సీసీ కెమెరాల ద్వారా సులభంగా గుర్తించొచ్చని అన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీల్లో నిక్షిప్తమైన వీడియోలతో సమాచారం సేకరించవచ్చని తెలిపారు.

నిబంధనలకు నీళ్లు!

(3వ పేజీ తరువాయి)

ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పరిగిలో వేసవిలో జోరుగా సాగుతున్న తాగు నీటి వ్యాపారం ప్రజలకు కొత్త కష్టాలను తెస్తోంది. పట్టణంలో రోజుకు 20 లీటర్ల వాటర్ బాటిళ్లు పది వేల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రోజుకు రూ.రెండు లక్షలకుపైగా నీటి వ్యాపారం జరుగుతోంది.


నీటి దందాపై నియంత్రణ ఏదీ?

నిబంధనలకు విరుద్ధంగా శుద్ధిజలం పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ, మిషన్ భగీరథ అధికారులు ఇరువురూ తమ పరిధిలోకి రాదని చెబుతున్నారు. ఇదే అదునుగా వాటర్‌ప్లాంట్ యజమానులు ఇష్టారాజ్యంగా జల దోపిడీకి తెగబడుతున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న మినరల్ వాటర్‌లో ఖనిజ లవణాలు(మినరల్స్) ఏవీ ఉండవు. ఈ నీటిని మలినాలు, బ్యాక్టీరియా లేకుండా తూతూ మంత్రంగా శుద్ధి చేసి డబ్బాల్లో అమ్ముతున్నారు.

కనిపించని లవణాల జాడ

డబ్బాల్లో నీటిని నింపేటప్పుడు సరైన విధానాలు పాటించడం లేదు. ఈ నీటిని రెండు రోజుల పాటు నిల్వ ఉంచితే బ్యాక్టీరియా పుట్టుకొస్తుంది. మరోవైపు ప్లాంట్లలో పనిచేసే సిబ్బందికి, యాజమాన్యానికి శుద్ధి విషయంలో సరైన అవగాహన కూడా లేకపోవడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం నీటిలో ఫ్లోరైడ్, పీహెచ్, ఖనిజ లవణాలను శుద్ధి జరగాలి. నీటిని నింపే ముందు డబ్బాలను శుభ్రం చేయాలి. బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ కలిపిన నీటితో కడగాలి. శుద్ధి ప్రక్రియ సమయంలో ఫ్రైజర్ ఫిల్టరింగ్‌తో నీటిలో మలినాలు లేవని నిర్ధారణ అయ్యేంత వరకు రెండు నిమిషాలకోసారి నీటిని పరీక్షించాలి. మలినాలు, బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసే మెంబ్రియలను వాడాలి. నీటిలో ఫ్లోరైడ్ శాతం1.0మి.గ్రా లోపు ఉండాలి. కానీ కొన్ని కంపెనీలు సరఫరా చేస్తున్న నీటిలో అది 2మి.గ్రాల వరకు ఉంటోంది. నీటిలో కరిగిన లవణాలు కనీసం 150 మి.గ్రా వరకు ఉండాలి. బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటే కలరా, ఇతర వ్యాధులు సోకి గొంతునొప్పి, జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తాయి.

చర్యలు తీసుకుంటాం



నీటి శుద్ధి ప్లాంట్ల యజమానులు నిబంధనలు పాటించాలి. అనుమతి లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. నీటి పరీక్షలు జరిపే శాఖ అధికారుల నుంచి అనుమతి తప్పక తీసుకోవాలి. మినరల్ వాటర్‌లో నిబంధనల ప్రకారం ఏమేమీ ఉండాలో వాటిని కచ్చితంగా పాటించాలి. లేకుంటే ప్లాంట్ సీజ్‌తోపాటు, కేసులు తప్పవు. - **వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి**

స్థానిక పోరుకు సన్నద్ధం కావాలి



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

(3వ పేజీ తరువాయి)

ప్రకటించినట్లుగా మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం పంపిణీ చేసే కార్యక్రమం ఈ సంవత్సరం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. మొదట వెయ్యి నుంచి ప్రారంభించి సంవత్సరానికి రూ.500 పెంచుతూ రూ.2,500 వరకు పెంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కేటీఆర్ ముఖ్యమంత్రి నాలుక చీరుస్తామని అంటున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు తలుచుకుంటే ఆయన తోలు తీస్తారని హెచ్చరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని వికారాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పీసీసీ పరిశీలకుడు వినోద్‌రెడ్డి, నరేందర్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్‌రెడ్డి, రత్నారెడ్డి, మహిపాల్‌రెడ్డి, ధారాసింగ్, కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, సతీష్‌రెడ్డి, శోభారాణి మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

శామీర్‌పేట, మే 7(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారు వార్షిక జాతరను ఈ నెల 12న నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌యాదవ్ తెలిపారు. బుధవారం మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, నాయకులు వెళ్లి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కట్టమైసమ్మ జాతరకు తప్పక రావాలని ఎమ్మెల్యేను కోరారు.

పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎస్సై యాదగిరి

దుద్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): దుద్యాల పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను ఎస్సై యాదగిరి బుధవారం ప్రారంభించారు. గత డిసెంబరు 26న ప్రారంభించిన పోలీస్‌స్టేషన్ తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దుద్యాల గేటు సమీపంలోని 1,090 సర్వే నంబరులోని 2ఎకరాల 18గుంటల భూమిలో చదును పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్సై విఠల్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఈ స్టేషన్‌లో ఇప్పటి వరకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రాలేదు. పోలెపల్లి, హకీంపేట్ ప్రజలు కోస్గి పోలీస్‌స్టేషన్‌కు, కుదురుమళ్ల, ఆలేడ్, సంగాయిపల్లి ప్రజలు కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు, ఇతర గ్రామాల ప్రజలు బొంరాస్‌పేట్ స్టేషన్‌కు వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చందూ మహరాజ్‌కు నివాళి

తాండూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంత బీసీ నాయకుడు, మాజీ మంత్రి దివంగత చంద్రశేఖర్(చందూ మహరాజ్) వర్ధంతి సందర్భంగా బుధవారం విలియమూన్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేశారు. బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సిములు, శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు లక్ష్మారెడ్డి, హబీబ్ లాల, లొంక నర్సిములు, ప్రభాకర్ గౌడ్, సయ్యద్ సుకుర్ నివాళులు అర్పించారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి బాలిక మృతి

బొంరాస్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఓ బాలిక మృతిచెందిన సంఘటన మండలంలోని రేగడిమైలారంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన బలిజ ప్రవీణ్-మమత దంపతుల కూతురు భవ్యశ్రీ(11) బుధవారం గ్రామ శివారులోని చెరువు దగ్గరికి పిల్లలతో కలిసి వెళ్లింది.చెరువులో గుంతలు గమనించక భవ్యశ్రీ నీటిలో మునిగి చనిపోయింది. బాలిక మృతితో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.



భవ్యశ్రీ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాదంలో మృతిచెందిన భాను

పరిగి, మే7(ఆంధ్రజ్యోతి): స్కూటీని డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. కొందుర్గు మండల కేంద్రానికి చెందిన బోయ మల్లయ్య, కుమారుడు భాను(20) బుధవారం పరిగికి వచ్చారు. తిరిగి స్కూటీ(టీజీ07 బీ7183)పై కొందుర్గుకు వెళ్తుండగా చిట్యాల శివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం(టీజీ30 ఢీకొట్టింది. ఈ ఘటనలో భాను అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లయ్యకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడ్చల్‌లో రెండు షాపుల్లో చోరీ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మేడ్చల్ టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టంలోని రెండు రుకాణాల్లో దొంగతనం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ ప్రధాన మార్కెట్‌లోని మనీష్ ట్రేడర్స్, ఆగర్వాల్ ట్రేడర్స్‌లో బుధవారం తెల్లవారు జామున దొంగలు దుకాణం షెటర్ పగులగొట్టి అగర్వాల్ ట్రేడర్స్‌లో రూ.2లక్షలు, మనీష్ ట్రేడర్స్‌లో రూ.35వేలు ఎత్తుకపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ సందర్శించి ఆధారాలు సేకరించారు.

ఊరికెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

ఘట్‌కేసర్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): సొంతూరికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపాటినగర్‌కు చెందిన తూళ్ల నరేందర్‌రెడ్డి కుటుంబంతో ఈ నెల 5న తన సొంతూరు భువనగిరికి వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో ఉంచిన తులం బంగారు, మూడు తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకపోయారు. సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు



తహసీల్దార్ వద్ద ముగ్గురిని బైండోవర్ చేయిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ

పెద్దేముల్, మే 7 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐ నిజాముద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని మారెపల్లితండా, కందనెల్లితండాల్లో సారా తయారు చేసిన ముగ్గురిని బుధవారం తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్ వద్ద బైండోవర్ చేశారు. చందూబాయి, అరుణ్‌లను సారా అమ్మరాదని అధికారి ముందు బైండోవర్ చేశారు. అలాగే ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారనే ఆరోపణపై కందనెల్లితండాకు చెందిన గోబ్రానాయక్‌ను బైండోవర్ చేశారు. వీరు బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలుశిక్ష, రూ.2లక్షల జరిమానా విధిస్తారని అధికారి చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

తాండూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మృతుడి అంత్యక్రియల నిమిత్తం మండల బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్సీ గౌడ్ రూ5వేల సాయం అందజేశారు. మల్కాపూర్‌నకు చెందిన మదికంటి పెద్ద హుస్సేనప్ప మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆర్సీగౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థిక సహాయాన్ని పెద్దలు, ఆర్సీ గౌడ్ యువసేన సభ్యుల ద్వారా మృతుడి కుటుంబానికి అందజేశారు.

బొంరాస్‌పేట్ బీజేపీ అధ్యక్షుడిగా శ్రావణ్‌గౌడ్



బొంరాస్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడిగా శ్రావణ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై ఎంపీ డీకే.అరుణకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పటిష్ఠతకు కృషిచేస్తానని తెలిపారు. అదే విధంగా బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, పూనంచంద్‌లాహోటి, బంటు రమేశ్, బస్వరాజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంసీపల్లి అధ్యక్షుడిగా నరేందర్..



నరేందర్‌ను సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మూడుచింతలపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండలాధ్యక్షుడిగా కేశవరానికి చెందిన తప్పెట్ల నరేందర్‌గౌడ్ బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బుధవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. నరేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు పార్టీ పెద్దలకు రుణపడి ఉంటానన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామీణ ప్రజల్లోకి తీసుళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. నారాయణపూర్ మాజీ ఉప సర్పంచ్ హన్మంతు ఎంపీ రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హైమారెడ్డి, శ్రీనివాస్, కార్యదర్శి మల్లెపల్లి నాగరాజు, విజయలక్ష్మీ, వెంకటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.